క్లుప్తంగా

అంబేద్కర్ విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని సీతానగర్‌లో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆదివారం బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు, మాజీ జెడ్పీటీసీ మౌల్కార్ లక్ష్మణ్, రిటైర్డ్ తహసీల్దార్ సుభాష్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన కార్యదర్శులు

దహెగాం: ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు తిరిగి ఆదివారం విధుల్లో చేరారు. మండలంలోని 14 మంది జేపీఎస్‌లు, 07 మంది ఓపీఎస్‌లు సమ్మె విరమించి విధుల్లో చేరినట్లు ఎంపీడీవో రాజేశ్వర్ తెలిపారు. సక్రమంగా విధులు నిర్వహించాలని, గ్రామాభివృద్ధికి పాటుపడాలని ఎంపీడీవో సూచించారు.

కౌటాల: ఎంపీడీవో కార్యాలయంలో జీపీ కార్యదర్శులు ఆదివారం తిరిగి విధుల్లో చేరినట్లు ఎంపీడీవో నస్రుల్లాఖాన్ తెలిపారు. మండలంలోని 15 మంది జేపీఎస్, ఇద్దరు ఓపీఎస్‌లు విధుల్లో చేరారని పేర్కొన్నారు. తమ డిమాండ్ల పరిష్కరించాలని 16 రోజుల పాటు చేసిన నిరవధిక సమ్మెను విరమించి మళ్లీ విధుల్లో చేరుతున్నట్లు సంఘం మండల అధ్యక్షుడు శేని తిరుపతి తెలిపారు.

నిధులు దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న వార్డు సభ్యులు, బీఎస్పీ నాయకులు

బెజ్జూర్: బెజ్జూర్ పంచాయతీలో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని, ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని, నిధులు దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వార్డు సభ్యులు, బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పంచాయతీ పరిధిలో ఒక్కో పనికి రెండుసార్లు బిల్లులు చేస్తూ అధికారులు బినామీల పనిచేస్తున్నారని మండిపడ్డారు. బెజ్జూర్ ఎంపీవో, గ్రామ సర్పంచ్, కార్యదర్శి ముగ్గురు కలిసి బీఆర్ఎస్ నేతలతో కుమ్మక్కై రూ.4లక్షల 97వేల 754 ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారన్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. వార్డు సభ్యులు సుర్ల ఇస్తారి, బీఎస్పీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు

కౌటాల: మండలంలోని ముత్తంపేటలో బెండారే నాందేవ్, బెండారే వాగు అన్నదమ్ముల ఇళ్లు అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. బాధిత కుటుంబాలకు ఆదివారం గ్రామ నాయకులు ఆర్థికసాయం అందజేశారు. దాతలు స్పందించి సాయం అందించాలని వారు కోరారు. సర్పంచ్ ఆదే శ్రీనివాస్, మాలీ సంఘం డివిజన్ అధ్యక్షుడు ఆదే నాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సీఎం కప్ మండల స్థాయి పోటీలు

కౌటాల: మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో సోమవారం నుంచి సీఎం కప్ మండల స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నస్రుల్లాఖాన్ తెలిపారు. ఈనెల 15,16,17వ తేదీల్లో ఉదయం 7 నుంచి 11 గంటల వరకు సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అథ్లెటిక్స్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, ఫుట్‌బాల్ క్రీడలను మినీ స్టేడియంలో నిర్వహిస్తామన్నారు. 15 నుంచి 36 ఏళ్ల వయస్సు ఉన్న మహిళలు, పురుషులు క్రీడల్లో పాల్గొనాలని కోరారు.

కెరమెరిలో..

కెరమెరి: సీఎం కప్‌లో భాగంగా సోమవారం నుంచి మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణంలో వివిధ క్రీడలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సత్యనారాయనగౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు క్రీడలు ప్రారంభిస్తామని, ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధశాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

తీరనున్న రోడ్డు కష్టాలు

- మహరాజ్‌గూడ-జంగుబాయి ఆలయం వరకు రోడ్డు నిర్మాణం
- 15 రోజుల్లో పనులు ప్రారంభం
- హర్షం వ్యక్తం చేస్తున్న భక్తులు



సీసీ రోడ్డు వేసేందుకు సిద్ధంగా ఉన్న జంగుబాయి రహదారి

కెరమెరి: తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దున వివాదాస్పద కెరమెరి మండలంలోని ముకదంగూడ పంచాయతీ మహరాజ్‌గూడ అడవుల్లో కొలువైన జంగుబాయి పుణ్యక్షేత్రంలో పూజల కోసం వచ్చే భక్తుల రవాణా సమస్యలు ఇక తీరనున్నాయి. మహరాజ్‌గూడ నుంచి జంగుబాయి ఆలయం వరకు సుమారు 3 కి.మీ రోడ్డు నిర్మాణం జరగనుంది. మరో పక్షం రోజుల్లో పనులు ప్రారంభం కానున్నాయి. దీంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బీటీకి బదులు సీసీ రోడ్డు

మహారాష్ట్ర ప్రభుత్వం మహరాజ్‌గూడ నుంచి జంగుబాయి ఆలయం వరకు సుమారు రూ.2.50 కోట్లతో బీటీ రోడ్డు వేయాలని నిర్ణయించి మంజూరు చేసింది. దీంతో సదరు కాంట్రాక్టర్, మార్చిలో బీటీ సంబంధించి పనులు ప్రారంభించారు. ఇప్పటికే పలుచోట్ల కల్వర్టుల వద్ద పైపులు వేశారు. మరిన్ని కల్వర్టు కోసం పైపులు అందుబాటులో ఉంచారు. లోతుగా తవ్వడం, నేల చదును చేయడం, కంకర వేయడం తదితర లాంటి పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. కాని ఆ ప్రాంతమంతా దిగువ ప్రాంతం కావడంతోపాటు నేల బీటీకి అనువైంది కాదని, చేసిన పని బూడిద పాలవుతుందని భక్తులు, ఆ ప్రాంత ప్రజలు అడ్డు చెప్పడంతో సదరు కాంట్రాక్టర్ ఈ విషయాన్ని మహారాష్ట్ర అధికారులకు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం వద్ద ఫైల్..

ప్రస్తుతం జంగుబాయి రోడ్డుకు సంబంధించిన ఫైల్ కేంద్రప్రభుత్వం వద ఉన్నట్లు తెలిసింది. మరో పక్షం రోజుల్లో ఫైల్ క్లియర్ కానుండడంతో రోడ్డు పనులు ప్రారంభం కానున్నాయి. కాగా ఇప్పటివరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా భక్తులు జంగుబాయి ఆలయానికి వెళ్తున్నారు. సదరు కాంట్రాక్టర్ చెట్లు, రాళ్ల, రప్పలు తొలగించి మట్టితో రహదారిని చదును చేశారు. కాగా, రూ.50 లక్షలు బడ్జెట్ పెంచేసి మొత్తం రూ.3 కోట్లతో సీసీ రోడ్డు వేసి శాశ్వత పరిష్కారం చూపాలని మహారాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే విజ్జకస నదిపై రూ.4.58 కోట్లతో చేపట్టిన వంతెన పనులు పూర్తయ్యాయి. దీంతో ఎలాంటి కష్టం లేకుండా ప్రజలు రాకపోకలు సాగుతున్నాయి.



భక్తులు పూజించే జంగుబాయి గుహ



కల్వర్టు కోసం అందుబాటులో ఉన్న పైపులు

సీసీ రోడ్డే మంచిది..



ఈ ప్రాంతంలో ఉన్న మట్టి తారురోడ్డు నిర్మాణానికి అంత మంచిది కాదు. అందుకు కాంట్రాక్టర్‌కు బీటీ వద్ద సీసీ రోడ్డు వేయాలని విన్నవించాం. ప్రస్తుతం బీటీ పనులు నిలిపివేసి సీసీ రోడ్డు వేసేందుకు ప్రయత్నం చేస్తున్నారు. జంగుబాయి వరకు వెళ్లేందుకు సీసీ రోడ్డే మంచిది.

– పతంగే లింబాదాస్, సర్పంచ్, ముకదంగూడ

వన్యప్రాణుల దాహం తీరేలా..



కమ్మర్‌గాం అటవీప్రాంతంలో సాసర్‌పిట్

- పెంచికల్‌పేట్ రేంజ్‌లో సోలార్ పంపులు
- నీటితొట్టెల్లో ట్యాంకర్లతో నీటి వసతి
- ఏర్పాట్లు చేస్తున్న అటవీశాఖ అధికారులు



గుండేపల్లి అటవీప్రాంతంలో ఏర్పాటు చేసిన సోలార్ మోటార్

పెంచికల్‌పేట్: మండుటెండల నేపథ్యంలో అటవీప్రాంతంలోని వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. పెంచికల్‌పేట్ రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతంలో అనేక వన్యప్రాణులు ఆవాసంగా మార్చుకుని జీవనం సాగిస్తున్నాయి. అవి దాహార్తిని తీర్చడానికి అటవీప్రాంతంలో నీటి కుంటలు, సాసర్‌పిట్స్, సోలార్ పంపు సెట్లు ఏర్పాటు చేస్తున్నారు.

సోలార్ పంపుసెట్లు..

ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో అటవీప్రాంతంలోని సహజ నీటివనరులు ఎండిపోయాయి. దీంతో వన్యప్రాణులు గ్రామాల వైపు వచ్చి ప్రమాదాలబారిన పడే అవకాశం ఉంది. అటవీశాఖ అధికారులు రేంజ్ పరిధిలోని చేడ్వాయి, లోడుపల్లి, పెంచికల్‌పేట్, అగర్‌గూడ, మురళీగూడ సెక్షన్ల పరిధిలో కృత్రిమ నీటి వనరులు ఏర్పాటు చేశారు. నీటి ఎద్దడి తలెత్తకుండా నిత్యం నీటి వనరులు పరిశీలిస్తూ వన్యప్రాణులకు నీటి లభ్యత ఉండేలా చర్యలు చేపడుతున్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు

అటవీప్రాంతంలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపడుతున్నాం. సహజ వనరులను మెరుగుపరుస్తూనే మరోవైపు సోలార్ పంపుసెట్లు, నీటి చెలిమెలు, సాసర్‌పిట్ల ద్వారా నీటిని అందిస్తున్నాం. ఎండాకాలంలో వన్యప్రాణులు సంరక్షించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశాం.

– ఎస్ వేణుగోపాల్, పెంచికల్‌పేట్ రేంజ్ అధికారి

పిల్లలూ జరపైలం



వ్యవసాయ బావిలో ఈత కొడుతున్న విద్యార్థులు (ఫైల్)

- వేసవిలో జాగ్రతలు తప్పనిసరి
- ఎండలో ఆటలు ఆడుతున్న చిన్నారులు
- వడదెబ్బ తగిలే అవకాశం
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

కౌటాల: జిల్లాలో భానుడి భగభగమంటున్నాయి. వేసవి సెలవుల కారణంగా పాఠశాలల విద్యార్థులు ఆటల్లో నిమగ్నమవుతున్నారు. చెట్లు, శిథిల భవనాలు, ప్రహరీ ఎక్కడం, నీటి గుంతల్లో దిగడం, గుర్తు తెలియని వ్యక్తుల వాహనాలు ఎక్కడం లాంటి చేస్తారు. గ్రామాల్లో పెద్దలు, యువకులు వ్యవసాయ బావుల్లో చల్లదనం కోసం ఈత కొడుతుంటారు. వీరిని అనుకరిస్తూ ఈత రాని పిల్లలు బావిలో దిగి ప్రమాదాలు బారినపడుతుంటారు. అలాగే ఎండన బారిన పడి వడదెబ్బకు గురవుతుంటారు. తల్లిదండ్రులు పిల్లలపై జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు.

ఎండల్లో ఆటలు వద్దు

వేసవి పిల్లలను ఎక్కువ తిరగనీయొద్దు. పిల్లలు నీడలో ఆడుకునేలా తల్లిదండ్రులు ఏర్పాట్లు చేయాలి. సాయంత్రం ఆటలు ఆడాలి. చెస్, క్యారమ్, వంటి ఇండోర్ గేమ్స్ ఆడాలి. ఎండలో క్రికెట్ వద్దు.

– జీజాబాయి, అంగన్‌వాడీ టీచర్, సదాశివపేట

జాగ్రత్తలు తీసుకోవాలి

పిల్లలపై తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. వారికి తరచూ ద్రవ పదార్థాలు ఇవ్వాలి. కొబ్బరి నీళ్లు ఎక్కువగా తాగించాలి. బయటకు వెళ్తే నీరు, గొడుగు వెంట తీసుకెళ్లాలి. ఎండకు నాలుక తడారి పోవడం, చర్మం పొడిబారి పోవడం లక్షణాలు కనిపిస్తే చక్కెర, ఉప్పు కలిపిన నీళ్లు తాగించాలి. అప్పటికి పరిస్థితి అదుపులో రాకపోతే వైద్యులను సంప్రదించాలి.

– నవత, వైద్యులు

పంచాయతీలో పుస్తకాలు..

విజ్ఞాన భాండాగారాల పరిస్థితి గాడి తప్పింది. నిర్వహణ లోపభూయిష్టంగా మారింది. కెరమెరిలో గ్రంథాలయ భవనం లేక యువత పుస్తకాల చదువులకు దూరమయ్యారు. గ్రంథాలయ నిర్వహణకు నాయకులు, అధికారులు, ఎలాంటి శ్రద్ధ చూపకపోవడంతో రెండేళ్లుగా పుస్తకాలు మూటల్లో నిక్షిప్తమయ్యాయి. పలువురికి జ్ఞానం పంచే పుస్తకాలు గ్రామ పంచాయతీ కార్యాలయంలో మూటల్లో బందీ అయ్యాయి.

- కెరమెరిలో గ్రంథాలయ భవనం కరువు
- పుస్తకాల చదువుకు విద్యార్థులు దూరం
- ఉద్యోగ అభ్యర్థులకు ఇబ్బందులు



గ్రంథాలయంలో మూటల్లో ఉన్న పుస్తకాలు

కెరమెరి: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రభుత్వం ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకుంటోంది. వీటన్నింటిని గమనించిన యువత వివిధ ఉద్యోగాల కోచింగ్ కోసం పట్టణాలకు పరుగులు తీస్తున్నారు. ఉన్న నిరుద్యోగులు గ్రంథాలయాన్ని పూర్తిస్థాయిలో ఉపయోగాద్దామంటే అది నిరుపయోగంగా మారింది. దీంతో నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఎక్కడ చదవాలి..ఎలా చదవాలనే మీమాంసలో మండలంలోని చదువుకున్న యువత ఉంది. కాని ఇక్కడ గ్రంథాలయం లేకపోవడంతో నిరుద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చదువుకు ఉన్న విలువ తెలియదో? లేదా మనకెందుకులే అనుకుంటారో? కాని గ్రంథాలయం పట్ల ఎలాంటి చొరవ తీసుకోవడం లేదు.

మండలంలో..

మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో 106 గ్రామాలు ఉన్నాయి. ఇందులో టీటీసీ, బీఎడ్, డిగ్రీలు, పీజీ చేసిన విద్యార్థులు సుమారు 253 మంది ఉన్నారు. వీరంతా ఉద్యోగాల కోసం కుస్తీ పడుతున్నారు. వారికి గ్రంథాలయం ప్రస్తుతం చాలా అవసరం. పత్రికలు, మ్యాగ్జిన్స్, కాంపిటేటీవ్ బుక్స్ ఇతరత్రా పుస్తకాల చాలా అవసరముంది.

జీపీ భవనంలో పుస్తకాలు

రెండేళ్ల క్రితం వరకు మండల కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ సెల్‌టవర్ పక్కన ఉన్న పాత గ్రామ పంచాయతీ కార్యాలయం ఉండేది. కాని దాన్ని కూలగొట్టి నూతనంగా షెడ్డు వేశారు. గ్రంథాలయంలో పుస్తకాలను పంచాయతీ కార్యాయువత ఎవరూ అటువైపు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. రెండేళ్ల నుంచి జీపీ భవనంలో గ్రంథాలయం ఉన్నా ఇప్పటి వరకు ఒక్కరు కూడా వెళ్లి అక్కడ పుస్తకాలు తెరిచిచూడలేదు. చాలా మందికి జీపీలో గ్రంథాలయం ఉన్న సంగతి తెలియకపోవడం గమనార్హం.



గ్రంథాలయం ఉన్న చోట నిర్మాణమైన షెడ్డు

మార్కెట్‌లో ఏర్పాటు చేయాలి



గ్రామ పంచాయతీలో ఉన్న గ్రంథాలయాన్నీ మార్కెట్‌లో ఎక్కడైన ఏర్పాటు చేయాలి. పోటీ పరీక్షల్లో ప్రిపేర్ కోసం యువతకు గ్రంథాలయం అవసరం ఎంతో ఉంది. నాయకులు, అధికారులు ఎలాంటి శ్రద్ధ తీసుకోవడం లేదు. పత్రికలకు కూడా దిక్కు లేకుండా పోయింది. అధికారులు స్పందించాలి.

– మొహర్లే దేవేందర్, కెరమెరి

ఎండలో కూర్చొని వీవోఏల నిరసన



నిరసన తెలుపుతున్న వీవోఏలు

కాగజ్‌నగర్‌టౌన్: మండుటెండను సైతం లెక్కచేయకుండా ఐకేపీ వీవోఏలు సమ్మె కొనసాగిస్తున్నారు. ఆదివారం ఐకేపీ కార్యాలయానికి తాళం వేసి ఉండడంతో ఎండలో గేటు ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు ముంజం ఆనంద్ మాట్లాడుతూ పట్టణంలో గత 28 రోజులుగా వీవోఏల నిరవధిక సమ్మె కొనసాగుతుందని తెలిపారు. ఐకేపీ ఆఫీస్‌కు తాళం వేసి ఉండడంతో ఎండలో గేటు ముందే కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ విషయాన్ని డీఆర్డీఓ పీడీ సురేంద్రకు సమాచారం అందించామన్నారు. వీవోఏల పోరాటం ఉద్యోగులతో కాదని, ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం సమ్మె చేపడుతున్నట్లు వివరించారు.

దళితుల సంక్షేమానికి కృషి

- ఎమ్మెల్యే జోగురామన్న



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జోగురామన్న

ఆదిలాబాద్‌టౌన్: దళితుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగురామన్న అన్నారు. ఈ నెల 29న మాదిగ సంక్షేమ సంఘ భవనం భూమిపూజ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. సర్వే నం.72లో సంఘ భవన నిర్మాణం చేపట్టనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి మాదిగ కులస్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చందాల రాజన్న, గాలిపెల్లి నాగన్న, అజయ్, మనోజ్, రాందాస్, ప్రభాకర్, సంజయ్, దయాకర్, నవీన్, అడెల్లు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం'



బేలలో ర్యాలీలో పార్టీ జిల్లా నాయకుడు కంది శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

బేల: కాంగ్రెస్ పార్టీని వీడిన ప్రతిఒక్కరూ వెనక్కి రావాలని, మళ్లీ సొంత గూటికి చేరాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కంది శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. బీజేపీ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి చేరిన సందర్భంగా ఆయనకు ఆదివారం మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో స్వాగత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ వేర్వేరు కాదని, ఇద్దరు ఒకటేనని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన హామీలు నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు, నిరుద్యోగ భృతి, రైతు రుణ మాఫీ ఏమైందని ప్రశ్నించారు. మాజీ జెడ్పీటీసీ రాందాస్, పార్టీ మండల అధ్యక్షుడు ఫైజుల్లాఖాన్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

ఇచ్చోడ : ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా పరిషత్ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని విఠలేశ్వర మందిరంలో నారాయణ్ మహరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సత్‌సంగ్‌లో పాల్గొని మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత ఆలయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించిందన్నారు. మండల కేంద్రంలో విఠలేశ్వర మందిరం వద్ద నూతనంగా ఏర్పాటు చేయనున్న మండపానికి జెడ్పీ నిధుల నుంచి రూ.10లక్షలు నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ ప్రీతంరెడ్డి మాట్లాడుతూ.. ఎంపీపీ నిధుల నుంచి మండప నిర్మాణానికి రూ.5లక్షల నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైష్ణవ సదన్ పీఠాధిపతి నారాయణ్ మహరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



రెడ్డినాయక్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

నార్నూర్: ఆల్ బంజారా సేవ సంఘం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన జాదవ్ రెడ్డినాయక్‌ను ఆదివారం సంఘం గౌరవ అధ్యక్షుడు అజ్మీరా శ్యాంనాయక్ ఆధ్వర్యంలో దొడంద గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లంబాడీ గిరిజనుల అభివృద్ధికి కృషిచేస్తున్న రెడ్డినాయక్‌ను జిల్లా అధ్యక్షుడిగా నియమించడం ఆనందంగా ఉందన్నారు. లంబాడీ గిరిజనుల సమస్యలతో పాటు వారి సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ కోసం కృషి చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో బంజారా సేవ సంఘం జిల్లా నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.